తొలి క్రాంతి NEWS

https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
శుక్రవారం
2-5-2025
వెల రూ. 4/-
పేజీలు : 04

**Published From : Hydarabad     Editor : Malothu Chandrakala**

# భారతీయ కళ సినిమాలకు ప్రజాదరణ

- భారత్ వద్ద కథల నిధికి కొదవలేదు
- ప్రేరణతో క్రియేటివ్ ను జోడించాలి
- వేవ్స్ ప్రారంభంలో ప్రధాని మోదీ



భారతీయ సినీరంగం ప్రపంచంలోని ప్రతిమూలలకు ఇక్కడి కళ, కథ, సాహిత్యాన్ని తీసుకువెళ్లడంలో సఫలమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజాహరిశ్చంద్ర, దాదా సాహెబ్ ఫాల్కే, రాజ్ కపూర్ లు ప్రపంచంలో సినిమా ప్రపంచంలో ప్రజాదరణ పొందారని చెప్పారు. 'వేవ్స్' (డబ్లూ ఎవీఆఎస్–వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్–2025) అంటే కేవలం కళ, సినిమా కాదన్నారు. ఈ వేదిక ద్వారా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను మరింత ప్రపంచంలోకి తీసుకువెళ్లే వేదికగా అవతరించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో వేల సంవత్సరాల నాటి కథల నిధి ఉందని చెప్పారు. ఇక్కడి చరిత్రలో కథలకు కొదవలేదన్నారు. 2



## వెంటాడి వెంటాడి చంపుతాం

- కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నాం
- మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు
- ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందే
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

2

## కులగణనపై కాంగ్రెస్ నాటకాలు

- 2010లోనే బీజేపీ కులగణనకు డిమాండ్
- ఎస్సీ వర్గీకరణు మార్గం చూపిన బీజేపీ
- నెహ్రూ సహా కాంగ్రెస్ నేతలు గణనను వ్యతిరేకించారు
- ముస్లింలను బీసీల్లో చేర్చింది కాంగ్రెస్స
- ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతి అభ్యర్థులను కాంగ్రెస్ వ్యతిరేకించింది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2



# కేసీఆర్ కడుపు నిండా విషమే

- 40 ఏళ్ల అనుభవం ఉన్న కేసీఆర్.. ఏ రోజైనా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చారా..?
- పదేళ్ల ఏనాడైనా ఒకటో తారీఖు జీతం వచ్చిందా?
- ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండి
- తెలంగాణ సాధనలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ కార్మికులు, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2





తెలంగాణలోని అసంఘటిత కార్మికుల కోసం దేశానికి రోల్ మాడల్‌గా ఉండే ఒక మంచి విధానం తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతున్న తరుణంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచనను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ మోడల్ తీసుకోండి

- తెలంగాణ కుల గణన దేశానికి రోల్ మోడల్
- అనుభవాలను కేంద్ర ప్రభుత్వానికి అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది
- తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవు
- జనాభా లెక్కలు ఎప్పుడు మొదలు పెట్టి ఎప్పటికి పూర్తి చేస్తారో కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


2

## సామాజిక తెలంగాణ సాధించలేకపోయాం

2



- భూమి లేని కార్మికులకు ఏమీ చేయలేకపోయాం
- మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోయేలా కృషి చేయాలి
- 20న కార్మికుల సమ్మెకు జాగృతి మద్దతు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



## కేటీఆర్‌కు ఆహ్వానం

- జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో సదస్సు
- ముఖ్యవక్తగా పాల్గొనాలని నిర్వాహకుల విజ్ఞప్తి

2

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికపై ప్రసంగించనున్నారు. జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ వార్షిక సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొనాలని నిర్వాహకులు ఆయన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే అంశంపై ఈ సదస్సు జరగనుంది.

## మోడీకి లేఖ రాసే దమ్ముందా?



2

- తెలంగాణ అభివృద్ధికేంద్రం అడ్డంకి
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

## పాలమూరుపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తాం
- ఎస్ఎల్ బీసీ టన్నెల్‌లో బాధ్యతగా ఆ కుటుంబ సభ్యులను ఆదుకుంటాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



# కేసీఆర్ కడుపు నిండా విషమే

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ ప్రతినిధి మే1(తొలి క్రాంతి):తెలంగాణలోని అసంఘటిత కార్మికుల కోసం దేశానికి రోల్ మాడల్‌గా ఉండే ఒక మంచి విధానం తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతున్న తరుణంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచనను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సోదరులందరికీ ముఖ్యమంత్రి మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..“మే డే రోజున కార్మిక సోదరులకు మాటిస్తున్నా. ఏ వెసులుబాటు ఉన్నా ప్రతి రూపాయి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, వారి పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టే బాధ్యత తీసుకుంటా. ఒకనాడు నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు జరుగుతున్న ఆర్టీసీలో ఈరోజు లాభాల బాటలో నడిచి జీతాలు చెల్లించుకునే స్థాయికి చేరుకోవడంలో కార్మికుల కృషి ఎంతో ఉంది. ఆర్టీసీని గాడిలో పెట్టి లాభాల వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నాం.సమ్మెకు వెళ్లాలని చర్చలు చేస్తున్నారు. ఈ సంస్థ మీదే. ఏమాత్రం పట్టింపులకు వెళ్లొద్దు. రాజకీయంగా ఎవరైనా ప్రోత్సహిస్తే, ఏదైనా తప్పుగా నిర్ణయం తీసుకుంటే మొత్తం వ్యవస్థ దెబ్బతినే పరిస్థితి ఉందన్న విషయాన్ని ఆలోచన చేయండి.మంత్రి తో చర్చించండి. చేయగలిగిందేమున్నా చేస్తాం. ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతున్న ప్రభుత్వాన్ని మళ్ళీ సమ్మెల పేరుతో ఏదైనా పొరపాటు జరిగితే, మళ్లీ పునరుద్ధరించడానికి అవకాశం కూడా లేని పరిస్థితులు తలెత్తుతాయి.మీ అందరి సహకారంతో అన్నింటా తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. కార్మిక చట్టాలను సవరించి కార్మికులను ఆదుకునే విధానాన్ని తెచ్చి దేశానికి మార్గదర్శిగా తెలంగాణ నిలబెడుతాం.తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, విద్యుత్ శాఖ కార్మికులు, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిది. వారిని ఆదుకోవాలనే ఆలోచనతో సవరించుకుంటూ, సరిచేసుకుంటూ పాలన పరమైన ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నాం.సింగరేణి సంస్థ లాభాల బాటలో నడవడమే కాకుండా గతంలో ఎప్పుడూ లేని స్థాయిలో కార్మికులకు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు బోనస్ చెల్లించాం. బీమా సౌకర్యం అమలు చేస్తున్నాం. సింగరేణి సంస్థలను లాభాల బాటలో నడిపించడమే కాకుండా బొగ్గు ఉత్పత్తి పెంచి, కొత్త గనులను కేటాయించి నూతనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రయత్నిస్తున్నాం. సింగరేణిలో దాదాపు 400 పైచిలుకు కారుణ్య నియామకాలు చేపట్టాం. ఆర్టీసీలోనూ కారుణ్య నియామకాలు చేపట్టాం.రైతు భరోసా, రైతు రుణమాఫీ, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి , ఆడబిడ్డలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, నిరుపేదలకు సన్నబియ్యం ఇలా రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం ఆగలేదు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ఇన్ని చేసినా సరిపోతాయని భావించడం లేదు. ఇంకా సమస్యలున్నాయి. కార్మికులకు కష్టాలున్నాయి. వాటన్నింటినీ పరిష్కరించాలంటే కొంత సమయం కావాలి.తెలంగాణలో పూర్తి చేసిన కులగణన దేశానికి ఆదర్శవంతంగా నిలబడింది. తెలంగాణ మాడలే ఈరోజు కేంద్ర ప్రభుత్వం తీసుకోవలసి వచ్చింది. కులగణన చేస్తామన్నాం. చేశాం. ఎస్సీ వర్గీకరణ చేస్తామన్నాం. చేశాం. ఉద్యోగాలు ఇస్తామన్నాం. ఇచ్చాం. సన్న బియ్యం ఇచ్చాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం... ఇలా చేయగలిగింది ప్రతిదీ చేస్తున్నాం. ఏదైనా సమస్య ఉంటే మీకే చెప్పుకుంటాం. సహకరించండి” కేసీఆర్ కడుపు నిండా విషమే40 ఏళ్ల అనుభవం ఉన్న కేసీఆర్.. ఏ రోజైనా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చారా అని ముఖ్యమంత్రి వివరించారు.




# తెలంగాణ మోడల్ తీసుకోండి

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ ప్రతినిధి మే1(తొలి క్రాంతి):దేశ వ్యాప్తంగా జనాభా లెక్కల సందర్భంగా కుల గణనను కూడా చేర్చాలని నిర్ణయించిన నేపథ్యంలో తమ అనుభవాలను కేంద్ర ప్రభుత్వానికి అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. జనాభా లెక్కల్లో కుల గణన అంశం చేర్చాలన్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతిస్తూ అందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, కేంద్ర మంత్రివర్గానికి అభినందనలు తెలియజేశారు.జనాభా లెక్కల్లో కుల గణన చేర్చాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.తెలంగాణలో నిర్వహించిన కుల గణన దేశానికి రోల్ మాడల్‌గా ఉందని, ఈ విషయంలో తమ అనుభవాలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని స్పష్టం చేశారు. ఓబీసీల్లో రాష్ట్రాల వారిగా వేర్వేరు కేటగిరీలుగా ఉన్నందున కుల గణన విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు.దేశ వ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపట్టబోయే ముందు రాజకీయ పార్టీలతో చర్చించడానికి మంత్రులతో ఒక కమిటీని నియమించాలని, అలాగే ఉన్నతస్థాయిలో అధికారులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి క్షుణ్ణంగా అధ్యయనం జరగాల్సి ఉంటుందని అన్నారు. తమ అనుభవాలను పంచుకోవడానికి కేంద్రం మమ్మల్ని పిలిచినా, లేదా కేంద్ర ప్రతినిధులు వచ్చినా తెలంగాణ నిర్వహించిన కులగణనలో అనుసరించిన విధివిధానాలను వివరిస్తామని చెప్పారు.కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో కులగణన పూర్తి చేసి దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉందని చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.జనాభా లెక్కలు ఎప్పుడు మొదలు పెట్టి ఎప్పటికి పూర్తి చేస్తారో కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని అన్నారు. కుల గణన చేపట్టడంలో ఎదురయ్యే సవాళ్లను ఏ విధంగా అధిగమిస్తారో అన్ని రాజకీయ పార్టీలను సమావేశ పరిచి వివరించి వారి సలహాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.రాష్ట్రాలతో పాటు రాజకీయ పార్టీలు, సివిల్ సొసైటీలు, ప్రజల నుంచి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. ఈ ప్రక్రియలు పూర్తయిన తర్వాత కుల గణనపై విధి విధానాలను ఖరారు చేయాలని సూచించారు. ఈ గణన పూర్తి చేయడానికి ఏడాది కాలం సరిపోతుందని చెప్పారు.కుల గణన చేయడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని, అందుకే శాసనసభ ద్వారా ఒక తీర్మానం ఆమోదించి కేంద్రానికి నివేదించామని తెలిపారు. కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించడానికి కూడా తమ ప్రభుత్వం ఒక బాధ్యతగానే చూస్తుందని చెప్పారు.ఇందులో ఎలాంటి రాజకీయాల జోలికి, పంతాలకు పట్టింపులకు వెళ్లదలచుకోలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో కుల గణన ఏ విధంగా చేపట్టిందీ ముఖ్యమంత్రి వివరిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టాలనుకుంటున్న కుల గణనకు తెలంగాణలో చేపట్టిన గణన ఒక మార్గదర్శిగా నిలుస్తుందని, తమ అనుభవనాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

# కులగణనపై కాంగ్రెస్ నాటకాలు

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**




హైదరాబాద్ ప్రతినిధి మే1(తొలి క్రాంతి):దేశ వ్యాప్తంగా కులగణన పై కాంగ్రెస్ పార్టీ నాటకాలు ఆడుతున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఎన్నడూ కులగణన చేపట్టాలనే ఆలోచన చేయలేదన్నారు. నెహ్రూ సహా రాజీవ్, సోనియా, కాంగ్రెస్ నేతలు అందరూ కులగణను వ్యతిరేకించారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు లోక్ సభలో తాము కులగణనకు వ్యతిరేకమని చెప్పారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ హయాంలో మాత్రమే కులగణన జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాము 2010లోనే కులగణన చేయాలని డిమాండ్ చేశామన్నారు. అప్పటి ప్రతిపక్ష నేత సుష్మ స్వరాజ్ యూఈఏ–2 ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశారని గుర్తు చేశారు. దానికి కట్టుబడే తాము కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.కాంగ్రెస్ వ్యూహాత్మకంగా బీసీ వర్గాలకు అన్యాయం చేసేందుకు ముస్లింలను బీసీల్లో చేర్చిందని కిషన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు ప్రత్యేకంగా మైనార్టీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. బీసీలకు అన్యాయం చేస్తూ.. ముస్లింల ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. నిజంగా వారికి చిత్తశుద్ధి ఉంటే ముస్లింలను బీసీల్లో ఎందుకు కలిపారని ప్రశ్నించారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన అశాస్త్రీయంగా నిర్వహించారని తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కోర్టులు ఎన్నిసార్లు చెప్పినా.. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బీజేపీ 2010లోనే దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. అప్పటి ప్రతిపక్ష నేత సుష్మ స్వరాజ్ అప్పటి ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాయడంతో పాటు లోక్ సభలో ప్రశ్నించిందని తెలిపారు. దానికి అనుగుణంగానే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కులగణనను ప్రారంభించేందుకు ముందడుగు వేసిందన్నారు. దానిపై యూపీఏ ప్రభుత్వం దాటవేత, వ్యతిరేఖ ధోరణి అవలంబించిందన్నారు. చిదంబరం కూడా కులగణన చేయబోమని పార్లమెంట్ సాక్షిగా చెప్పారన్నారు. బీసీల్లోని అనేక కులాలకు న్యాయం చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. అనేక కులాలు వెనుకబాటుకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. హస్తం పార్టీ బీసీల విషయంలోనే కాకుండా ఎస్సీ, ఎస్టీల విషయంలోనూ పక్షపాత వైఖరి ప్రదర్శించిందన్నారు. రాష్ట్రపతి అభ్యర్థులను ఎస్సీ, ఎస్టీలను బరిలోకి దింపితే.. వారిని ఓడించేందుకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ, గత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ లను బీజేపీ బరిలోకి దింపితే కాంగ్రెస్ వారిని ఓడించేందుకు విశ్వ ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ ఎన్నో దశాబ్దాలుగా తెగని పంచాయితీగా ఉంటే మోదీ ప్రభుత్వం పరిష్కారానికి బాటలు వేసిందన్నారు. కేంద్రం తీసుకున్న కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు చరిత్రాత్మకం అని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# వెంటాడి వెంటాడి చంపుతాం

**- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ ప్రతినిధి మే1(తొలి క్రాంతి):జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో చోటుచేసుకున్న ఉగ్రదాడిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని స్పష్టం చేశారు. అమిత్ షా మాట్లాడుతూ.. ‘ ఉగ్రవాదాన్ని అంతం చేసేంత వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయం. ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకొని శిక్షిస్తాం కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నాం. దాడి చేసి విజయం సాధించామని అనుకుంటే అది పొరపాటే. ఇది మోదీ సర్కార్. మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు. వెంటాడి వెంటాడి అంతం చేస్తుంది. పహల్గామ్‌లో అమాయకుల చావులకు కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందే’ అని అన్నారు.పర్యాటకులపై దాడికి రెండు రోజుల ముందే ఉగ్రవాదులు బైసరన్ లోయకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఆ ఉగ్రవాదులు మొత్తం మూడు చోట్ల మారణకాండ సృష్టించాలని భావించారట. అరు వ్యాలీ, ఎమ్యూజ్ మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీలలో దాడికి పాల్పడాలని అనుకున్నారట. ఈ ప్రదేశాలలో భద్రతా దళాలు ఉండటం వల్ల వారి ప్రణాళిక విఫలమైందని సమాచారం. బైసరన్ లోయ దాడికి సంబంధించి ఉగ్రవాదులకు నలుగురు భూగర్భ కార్మికులు సహాయం చేసినట్లు తెలుస్తోంది. ఉగ్రదాడికి సంబంధించి అధికారులు దాదాపు 180 మందిని విచారిస్తున్నట్లు సమాచారం.

# సామాజిక తెలంగాణ సాధించలేకపోయాం

**- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్ ప్రతినిధి మే1(తొలి క్రాంతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భౌగోళిక తెలంగాణ సాధించుకున్నప్పటికీ సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని విచారం వ్యక్తం చేశారు. భూమి లేని కార్మికులకు ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందని పేర్కొన్నారు.కవిత మాట్లాడుతూ రైతుబంధు కింద ఎకరం భూమి ఉన్న వారికి రూ.10,000, పది ఎకరాల వారికి లక్ష రూపాయలు ఇచ్చామని, అయితే భూమి లేని కార్మికులు మాత్రం ఆదరణకు నోచుకోలేదని వివరించారు. భవిష్యత్తులో భూమి ఉన్నా లేకున్నా, అందరినీ ఆదుకునే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని సూచించారు.రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ. 8 లక్షలు కాగా, అదే సమీపంలోని వికారాబాద్ జిల్లాలో అది కేవలం రూ.1.58 లక్షలే అని ఆమె తెలిపారు. కేవలం పది కిలోమీటర్ల దూరంలో ఇంత తేడా ఉండటం ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు. ఈ అసమానతలు తొలగించేందుకు మేడే స్ఫూర్తి కావాలని అన్నారు.మహిళా నాయకురాలిగా సామాజిక తెలంగాణ దిశగా భవిష్యత్తులో గట్టి అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. మే 20న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మికుల సమ్మెకు జాగృతి సంస్థ తరపున మద్దతు ఉంటుందని తెలిపారు.

# మోడీకి లేఖ రాసే దమ్ముందా?

**- తెలంగాణ అభివృద్ధికేంద్రం అడ్డంకి**
**- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్ ప్రతినిధి మే 1(తొలి క్రాంతి):తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అడ్డంకిగా మారారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో పారదర్శకంగా నిర్వహించిన కులగణనపై తప్పుడు ఆరోపణలు చేయడం, తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేయడం కేంద్ర మంత్రుల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.బీసీల పట్ల బీజేపీకి నిజమైన నిబద్ధత ఉంటే, పార్లమెంట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం చేయాలని, 50 శాతం రిజర్వేషనుల పరిమితిని ఎత్తివేయాలని గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ బిల్లు చట్టబద్ధత కోసం ప్రధాని మోదీకి లేఖ రాయాలంటూ కేంద్ర మంత్రులకు సవాల్ విసిరారు.కులగణనపై కేంద్రం నిర్ణయంతో రాహుల్ గాంధీ సంకల్పం విజయవంతమైందని గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ ఆలోచనలతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం శాస్త్రీయంగా కులగణన నిర్వహించారని తెలిపారు. శాసనసభలో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించామని చెప్పారు.తెలంగాణ కులగణనపై బండి సంజయ్, కిషన్ రెడ్డి తప్పులు తడక అనడం దిగజారుడుతనానికి నిదర్శనమని గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్‌తో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కడం బీజేపీ నేతలకు అలవాటైందని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ ఒక బీసీ బిడ్డ7 7గా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు.తెలంగాణ స్వతంత్ర భారతంలో తొలిసారిగా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా చరిత్రలో నిలిచిందని గౌడ్ పేర్కొన్నారు. చారిత్రాత్మక కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. కేంద్రం దేశవ్యాప్తంగా కులగణన ఎప్పుడు నిర్వహించబోతుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# భారతీయ కళ సినిమాలకు ప్రజాదరణ

**వేవ్స్ ప్రారంభంలో ప్రధాని మోదీ**

ముంబాయి మే1(తొలి క్రాంతి): భారతీయ సినీరంగం ప్రపంచంలోని ప్రతిమూలకు ఇక్కడి కళ, కథ, సాహిత్యాన్ని తీసుకువెళ్లడంలో సఫలమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజాహరిశ్చంద్ర, దాదాసాహెబ్ ఫాల్కే, రాజ్ కపూర్ లు ప్రపంచంలో సినిమా ప్రపంచంలో ప్రజాదరణ పొందారని చెప్పారు. ‘వేవ్స్’ (డబ్ల్యూఏవీఈఎస్–వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్–2025) అంటే కేవలం కళ, సినిమా కాదన్నారు. ఈ వేదిక ద్వారా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను మరింత ప్రపంచంలోకి తీసుకువెళ్లే వేదికగా అవతరించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో వేల సంవత్సరాల నాటి కథల నిధి ఉందని చెప్పారు. ఇక్కడి చరిత్రలో కథలకు కొదవలేదన్నారు. ఈ కథలను ప్రేరణగా తీసుకొని క్రియేటివ్‌ను జోడించి ప్రపంచానికి పరిచయం చేయాలని ఈ సభకు విచ్చేసిన ప్రముఖులను, ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.గురువారం మహారాష్ట్రలో వేవ్స్ సమ్మిట్ 2025ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు. ఈ సమ్మిట్ మే 4 వరకు కొనసాగనుంది. ఈ సమ్మిట్ లో 90 దేశాల నుంచి 10వేల మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. 300పైగా సంస్థలు, 350 స్టార్టప్ లు, 1000మంది బడా నిర్మాతలు పాల్గొననున్నారు. తొలిరోజు ఉత్తరాది, దక్షిణాది ప్రముఖ సినీ తారలంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. వందలాది దేశాల నుంచి కళాకారులు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు సమావేశమయ్యారని అన్నారు. ప్రపంచ ప్రతిభ, ప్రపంచ సృజనాత్మకతతో కూడిన ప్రపంచ పర్యావరణ వ్యవస్థకు పునాది పడబోతుందన్నారు. వేవ్స్ అనేది కేవలం సంక్షిప్త రూపం కాదన్నారు. ఒక తరంగం – సంస్కృతి, సృజనాత్మకత, సార్వత్రిక అనుసంధానం అన్నారు. భవిష్యత్ లో ఈ రంగానికి సంబంధించి అవార్డులను కూడా అందజేస్తామని చెప్పారు. కళాకారుడికి, ప్రతి సృష్టికర్తకు ప్రపంచవేదికగా వేవ్స్ ఎదగాలని ఆశించారు. యువత సృజనాత్మక ప్రపంచంతో కనెక్ట్ అయ్యే చోటు వేవ్స్ గా రూపుదిద్దాలని పిలుపునిచ్చారు. కంటెంట్, సృజనాత్మకత, సంస్కృతి అనేవి ఆరెంజ్ ఎకానమీకి మూడు అక్షాలవంటివన్నారు. భారతీయ సినిమాల పరిధి ఇప్పుడు ప్రపంచంలోని ప్రతి మూలకు చేరుకుంటోందని భారతీయ సినిమాలు 100 కి పైగా దేశాలలో విడుదలవుతున్నాయని చెప్పారు. డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతానికి ప్రపంచ కేంద్రంగా మారుతోందని చెప్పారు. నేడు భారతీయ చిత్ర పరిశ్రమ 430 బిలియన్ డాలర్లకు పైగా వాటాను కలిగి ఉందన్నారు. రాబోయే సమయంలో ఇది మరింత రెట్టింపు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

# కేటీఆర్ కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

హైదరాబాద్ ప్రతినిధి మే1(తొలి క్రాంతి):బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికపై ప్రసంగించనున్నారు. జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ వార్షిక సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొనాలని నిర్వాహకులు ఆయన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు.'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే అంశంపై ఈ సదస్సు జరగనుంది. ఈ సమావేశంలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, ఆచార్యులతో పాటు వివిధ దేశాల నిపుణులు పాల్గొంటారు. భారతదేశ ప్రగతి ప్రస్థానం, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలు, సాంకేతికత ఆధారిత అభివృద్ధి నమూనాపై కేటీఆర్ తన అనుభవాలను, ఆలోచనలను పంచుకోనున్నారు. యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతిపెద్ద కార్యక్రమాల్లో ఒకటైన ఈ ఫోరమ్, భారతదేశ పురోగతిని ప్రపంచానికి చాటే వేదికగా నిలుస్తుంది. కేటీఆర్ అనుభవాలు అంతర్జాతీయ నిపుణులకు, విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని ఫోరమ్ వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేఠి ఆశాభావం వ్యక్తం చేశారు

# పాలమూరులో బీఆర్ఎస్ నిర్లక్ష్యం

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

పాలమూరు ప్రతినిధి మే1(తొలి క్రాంతి):ఎస్ఎల్ బీసీ టన్నెల్ సంఘటన దురదృష్టకరం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బాధ్యతగా ఆ కుటుంబ సభ్యులను ఆదుకుంటాం.. దొరకని ఆరు మృతదేహాలు బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నాం.. ప్రభుత్వపరంగా ఒక్కో కుటుంబానికి 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాం.. జియో లాజికల్ సర్వే సూచన మేరకే రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేశాం.. ఆరు మృతదేహాల ఘటన స్థలంలో క్రిటికల్ కండిషన్ ఉంది, రెస్క్యూ సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటంతో పనులు ఆపేశాం.. ఎస్ఎల్ బీసీ టన్నెల్ పనుల పూర్తి కోసం హై లెవెల్ టెక్నికల్ ఎక్స్ పర్ట్స్ కమిటీ వేశామన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ హామీ ఇచ్చారు.అయితే, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగవంతానికి చర్యలు చేపట్టి 2027 మార్చి నాటికి ఉదండాపూర్ వరకు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రాజెక్టుల కోసం భూ సేకరణకు సత్వర చర్యలకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నాం.. పాలమూరు జిల్లా గత బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైంది అని ఆరోపించారు. టీఆర్ఎస్ హయాంలో కృష్ణా నది జలాల కేటాయింపులో పాలమూరు, నల్లగొండకు తీరని అన్యాయం జరిగింది అన్నారు. 819 టీఎంసీల కృష్ణ జలాలను ఆంధ్రకు కేటాయిస్తుంటే.. కేసీఆర్ సర్కార్ చోద్యం చూసిందన్నారు. 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు వాటా దక్కింది.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలు చేశారు.. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు మరో రెండు ఏళ్లలో పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.





## గుమ్మడిదలలో ఘనంగా మేడే వేడుకలు

గుమ్మడిదల, మే 01 తొలి క్రాంతి:గుమ్మడిదల మండల కేంద్రంలో కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పిలుపు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుమ్మడిదల మండల కేంద్రంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ కార్మిక విభాగ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "మేడే అనేది కార్మికుల త్యాగాలను స్మరించుకునే రోజు మాత్రమే కాకుండా, వారి హక్కుల కోసం పోరాడాల్సిన రోజుగా భావించాలి. కార్మికుల శ్రమ లేకుండా సమాజ అభివృద్ధి అసాధ్యం. రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలను అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రమణారెడ్డి,దేవేందర్ రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, బాల్ రెడ్డి,వెంకట్రామిరెడ్డి, సదానంద రెడ్డి, మైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ సూర్యనారాయణ చెంద్రారెడ్డి, జైపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లేష్,అయుబ్,రాజు గౌడ్, రమేష్,పలువురు నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ప్రొటెం స్పీకర్ భూపాల్ రెడ్డి కి జన్మదిన వేడుకలు

– బిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో అమీన్పూర్, మే 01 తొలిక్రాంతి( ప్రశాంత్ ): తెలంగాణ శాసనమండలి మాజీ ప్రొటెమ్ స్పీకర్ భూపాల్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఆయన మాట్లాడుతూ ఇలాగే ఎన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంటా అంజన్న, ఉద్యమకారుడు శ్రీధర్ చారి,రాజేష్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. భూపాల్ రెడ్డి సంతోషం వ్యక్తపరుస్తూ నేటి యువతరం నుండి ఇంకా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని వారు సానుకూలంగా బీఆర్ఎస్ నాయకులను అభినందించారు.



## 139వ మే డే సందర్భంగా ములకలపల్లి మండలంలో ఘనంగా

ములకలపల్లి, మే 01 తొలి క్రాంతి:ములకలపల్లి మండల వ్యాప్తంగా 139వ మే డేను సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముకమామిడి, తిమ్మంపేట, కమలాపురం, చలమన్నగర్, రాచన్నగూడెం కేంద్రాలలో జెండా ఆవిష్కరణతో మే డే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా మాస్ లైన్ మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ మాట్లాడుతూ, "అధిక పని గంటలు కార్మిక రక్తాన్ని పీల్చిపిప్పి చేసే విధంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనం" అని విమర్శించారు. 1886లో చికాగోలో జరిగిన కార్మికుల త్యాగాలను స్మరిస్తూ, 8 గంటల పని హక్కు కోసం మళ్లీ ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన వేతనం, లీవింగ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, నకిరేకంటి నాగేశ్వరరావు, బత్తుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.మేడే స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కొంటూ, పని గంటల పెంపును తిప్పికొట్టాలని నాయకులు నినాదాలు చేశారు.



## 39వ మే డే సందర్భంగా కార్మిక హక్కుల కోసం ఐఎఫ్టియు ఉద్యమం

భద్రాద్రి కొత్తగూడెం, మే 01 తొలి క్రాంతి:139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెంలో ఐఎఫ్టియు ఆధ్వర్యంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణలు జరిగాయి. రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు జెండా ఎగురవేయగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే. సీతారామయ్య ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే పండుగ కాదు, పోరాట దినమని స్పష్టం చేశారు. 8 గంటల పని హక్కు కోసం జరిగిన చికాగో ఉద్యమంలో 13 మంది కార్మికులు అమరులయ్యారని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించేందుకు కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని విమర్శించారు. కార్మిక వేతనాల పరిరక్షణ, పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఎఫ్టియు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.





# జవహర్ విద్యార్థులు దూకుడు





**విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా మెమెంటోలు, అభినందనలు**

అశ్వారావుపేట ప్రతినిధి మే1(తొలి క్రాంతి):అశ్వరావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలంలో విద్యా రంగంలో ఓ చరిత్ర సృష్టించిన ఘట్టం ఆవిష్కృతమైంది. పదో తరగతి ఫలితాల్లో మండల ఫస్ట్ ర్యాంకుతో పాటు 500 పైగా మార్కులు సాధించిన జవహర్ విద్యాసంస్థల విద్యార్థులు దూకుడు కనుబరుస్తూ ఘన విజయాన్ని అందుకున్న నేపథ్యంలో వారిని సత్కరించేందుకు ఓ ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.గండుగులపల్లి క్యాంప్ ఆఫీస్ ప్రాంగణం గౌరవానికి నిలయంగా మారింది. రాష్ట్రంలో సేవలందిస్తున్న యువ, సంకల్పశక్తి గల నాయకుడు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వయంగా హాజరై విద్యార్థులకు మెమెంటోలు, అభినందన పత్రాలు అందజేశారు. విద్యార్థుల విజయోత్సవం వేళ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "జవహర్ విద్యాలయం ఈసారి మండల ఫస్ట్ సాధించడమే కాకుండా విద్యలో రారాజుగా నిలబడటం గర్వకారణం. ఇది విద్యార్థుల కృషి ఉపాధ్యాయుల పట్టుదల తల్లిదండ్రుల స్ఫూర్తిదాయక సహకారం ఫలితమే" అని కొనియాడారు. అలాగే పదో తరగతిలో మంచి మెరిట్ సాధించడం అనేది జీవిత విజయంలో మొదటి అడుగు. ఈ చిన్నారులు రేపటి భారతభాగ్య విధాతలు" అని విద్యార్థులను ప్రోత్సహించారు.జవహర్ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఇనుగంటి ప్రవీణ్, మైథిలి మాట్లాడుతూ, "మా విద్యార్థులు ప్రతీ ఏడూ మెరిట్ లో రాణించడం ఆనందంగా ఉంది ఇది మా టీచర్ల సమిష్టి కృషికి నిదర్శనం" అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకను మరింత ప్రత్యేకంగా మార్చారు. విద్యార్థుల కళ్లు ఆనందంతో మెరిశాయి.



## పాల్వంచలో మే డే జెండా ఆవిష్కరణలు కార్మిక హక్కుల పరిరక్షణపై ఐఎఫ్టియు నాయకుల పిలుపు

పాల్వంచ, ఏప్రిల్ 01 తొలి క్రాంతి:139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచలో ఐఎఫ్టియు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. కార్మికుల 8 గంటల పని హక్కు కోసం వారి త్యాగాలను గుర్తు చేస్తూ, కార్మిక హక్కులను కాపాడాలని, నాలుగు లేబర్ కోళ్లకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు.నటరాజ్ సెంటర్లోని భవన నిర్మాణ అడ్డమీద జిల్లా అధ్యక్షుడు ఎర్నం శ్రీను, బస్టాండ్ సెంటర్లో గౌరవ సలహాదారుడు ఎస్. ఉపేందర్ రావు, కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా నాయకులు మారుతి రావు, అంబేద్కర్ సెంటర్లో భవన నిర్మాణ సంఘ నాయకులు కె. నరసింహారావు జెండా ఆవిష్కరణలు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. ఉపేందర్ రావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు మారుతి రావు, నరసింహారావు, భాస్కర్, మల్లేష్, రాజేష్, లాజర్, శ్రీనివాస్, రమేష్, రామస్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.



## మే డే సందర్భంగా కార్మిక సంఘాల నేతలతో కల్వకుంట్ల కవిత ఆత్మీయ సమ్మేళనం

భద్రాద్రి కొత్తగూడెం, మే 01 తొలి క్రాంతి:ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులతో టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం బుధవారం ఆమె స్వగృహంలో జరిగింది.కార్మిక వర్గ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులను గుర్తిస్తూ, కవిత వారిని శాలువాలతో సత్కరించి మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిబిజికెఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణకు నిస్వార్థ సేవల కోసం ప్రత్యేక గౌరవం లభించింది.ఈ వేడుకలో టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరముందని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు.

## పనిచేసే వారికి ఎల్లవేళలా ప్రశంసలు

**...*పసుపులేటి పదవీ విరమణసభలో ఆర్టీసీ డిఎం**

*** ఘనంగా పసుపులేటి పదవి విరమణ.**

సత్తుపల్లి, మే 01 తొలి క్రాంతి:ప్రజల కోసం పనిచేసే వారికి అన్నివేళలా అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తాయని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అన్నారు.సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న పసుపులేటి సుబ్బారావు ఉద్యోగ విరమణ సభ స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో జరిగింది. అధికారులు, సిబ్బంది,బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ పూలమాలలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.విశ్వశాంతి స్కూల్ ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలోడిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ..గత 38 సంవత్సరాలుగా సుబ్బారావు ఆర్టీసీలో వివిధ హోదాలలో అంకితభావంతో సంస్థ అభివృద్ధికి అలుపెరగని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు.దీనికి ప్రతిఫలంగా 7సార్లు ఆయన ఆర్టీసీ అధికారుల నుంచి అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు.కుటుంబ బాధ్యతలు , ఉద్యోగ బాధ్యతలు విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఆర్థికంగా వెనకబడిన తన బంధువుల పిల్లలకు ఆశ్రయం కల్పించి వారి ఉన్నత చదువులకు తోడ్పాటు అందించి తద్వారా వారు మంచి స్థానంలో నిలబడటానికి సుబ్బారావు, సుశీల దంపతులు చేసిన కృషిని అభినందించారు. సహాయ డిపో మేనేజర్ విజయ శ్రీ మాట్లాడుతూ ఆర్టీసీ కండక్టర్ గా, ఏడిసిగా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్గా సుబ్బారావు సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంఎఫ్ సాహితి, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుబ్బారావు నివాసంలో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ప్రస్తుతం వివిధ హోదాలలో ఉన్న బంధువులు ఈ సందర్భంగా ఆయన సేవలను ప్రస్తావిస్తూ ఘనంగా సత్కరించారు.








# పాల్వంచలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ, మే 01 తొలి క్రాంతి:పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.పాత పాల్వంచకు చెందిన ఉప్పునూరి నాగముత్యం కుమార్తె మౌనిక వివాహ వేడుకలో కొత్వాల పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.నవభారత్ ప్రాంతానికి చెందిన, శ్రీ పెద్దమ్మతల్లి జనరల్ స్టోర్స్ యజమాని ఊరుకొండ వెంకటేశ్వర్లు కుమారుడు నాగేంద్ర వివాహ వేడుకలో కూడా కొత్వాల పాల్గొని తన శుభాకాంక్షలు తెలిపారు.నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన తుపాకుల అనసూయ ఇటీవల మృతి చెందగా, గురువారం నిర్వహించిన దశదిన కర్మల కార్యక్రమంలో కొత్వాల పాల్గొని నివాళులర్పించారు. ఆమె కుమారులు తుపాకుల శోభన్ బాబు, రాంబాబు, రవిబాబు, శేఖరబాబులను ఓదార్చారు.ఈ కార్యక్రమాల్లో పాల్వంచ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, దారా చిరంజీవి, పులి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు



## గంగపుత్ర సంఘం రాజేష్ ఖన్నా అభిప్రాయం

హైదరాబాద్, మే 01 తొలి క్రాంతి:దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ గంగపుత్ర సంఘం తరపున స్వాగతిస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలిపారు. ఈ నిర్ణయం సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42% బీసీ బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని కోరారు.

# ఖమ్మం జిల్లా క్రీడా రంగానికి నూతన శోభ

## సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన





ఖమ్మం, మే 01 తొలి క్రాంతి:ఖమ్మం జిల్లా క్రీడారంగంలో చారిత్రక మలుపు తిరుగుతోంది. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం మరింత ఆధునీకరణ వైపు అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక యత్నంతో, రూ. 8.50 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మంత్రి తుమ్మల చేతుల మీదుగా భూమిపూజ జరగనుంది.ఈ కొత్త ట్రాక్ నిర్మాణంతో ఖమ్మం స్టేడియం జాతీయ, అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు వేదికగా మారనుంది. గతంలో ఊహించలేని స్థాయిలో మౌలిక సదుపాయాలను అందించేందుకు తుమ్మల ప్రభుత్వం కృషి చేస్తోంది. నగరంలోని ఇతర క్రీడా ప్రాంగణాలు కూడా ఆధునీకరణ దిశగా మారనున్నాయి.సింథటిక్ ట్రాక్: అథ్లెటిక్స్ శిక్షణకు శక్తివంతమైన వేదికసింథటిక్ ట్రాక్ ద్వారా అథ్లెట్లకు మన్నికైన, స్థిరమైన మరియు గాయాల రహితమైన ఉపరితలం లభించనుంది. ఇది వేగవంతమైన రన్నింగ్‌కు, సుదీర్ఘ జంప్స్‌కు, మల్టీ ఈవెంట్ శిక్షణకు అత్యుత్తమ పరిష్కారంగా నిలుస్తుంది. వాతావరణ ప్రభావాల నుంచి రక్షణ, తక్కువ నిర్వహణ అవసరం, సకాలంలో పోటీలు నిర్వహించేందుకు సౌలభ్యత వంటి అంశాలు దీనికి ప్రత్యేకత.సహజ మట్టి ట్రాక్‌లతో పోలిస్తే, సింథటిక్ ట్రాక్‌లు అథ్లెట్లకు మెరుగైన పనితీరు సాధించేందుకు దోహదపడతాయి. మట్టి ట్రాక్‌లో శిక్షణ పొందిన అథ్లెట్లు సింథటిక్ ట్రాక్ పోటీల్లో పాల్గొన్నప్పుడు సమయ వ్యత్యాసం (1.5 – 2 సెకన్లు) వల్ల పతకాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే, జిల్లా స్థాయి నుంచే సింథటిక్ ట్రాక్ పై శిక్షణ అవసరం.ఖమ్మం యువతలో ఆనందోత్సాహాలుఈ ప్రాజెక్ట్ ప్రకటించగానే ఖమ్మం జిల్లా క్రీడాకారులు, యువతలో ఉత్సాహం వ్యక్తమవుతోంది. ఇటీవల నిర్వహించిన సిఎం సియు పి – 2024 లో ఖమ్మం జిల్లాకు చెందిన అథ్లెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 12 బంగారు పతకాలు సాధించారు. వారంతా ఖమ్మం స్టేడియంలో శిక్షణ పొందినవారే కావడం విశేషం. ఇది రాబోయే కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖమ్మం అథ్లెట్ల విజయాలను అందించే పునాది అవుతుంది.మంత్రి తుమ్మలకు క్రీడాభిమానుల ధన్యవాదాలుఖమ్మం జిల్లాకు అత్యాధునిక క్రీడా వేదికను అందించినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు క్రీడాభిమానులు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు. క్రీడారంగంలో ప్రాంతీయ అసమానతలను తొలగించి, గామ్యమైన అవకాశాలు అందించేందుకు ఆయన చేపడుతున్న చర్యలు అభినందనీయం.ముగింపుఈ సింథటిక్ ట్రాక్ నిర్మాణంతో ఖమ్మం క్రీడారంగానికి ఇది నూతన దిశ, భవిష్యత్ అథ్లెటిక్స్ విజేతలకు శుభప్రదమైన ఆరంభం. ఖమ్మం యువతకు, క్రీడాకారులకు ఇది దిశానిర్దేశకంగా నిలుస్తుంది.

# ప్రభుత్వ పాఠశాల కిరణం

– 546 మార్కుల ముద్దుబిడ్డ హరిణి స్కూల్ టాపర్‌గా మెరిసిందిటేకులపల్లి మే 5(తొలి క్రాంతి): విడుదలైన పదవ తరగతి ఫలితాలలో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వాంకుడోత్ హరిణి పవార్ తో కుటుంబం ఆనందోత్సాహాలతో ముంచెత్తుతోంది. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన హరిణి, 546 మార్కులతో తమ స్కూల్‌లో మొదటి ర్యాంక్ సాధించడంతో పాటు టేకులపల్లి మండలంలో గర్వకారణంగా రెండవ స్థానాన్ని ఆక్రమించారు.వారి తండ్రి హథీరామ్ నాయక్ ఎమ్.పి.పి.ఎస్. లక్ష్మీపురం పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. తల్లి కె.జి.బి.వి. టేకులపల్లిలో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా బోధన చేస్తున్నారు. ఈ విజయంతో హరిణి కేవలం తల్లిదండ్రులకే కాదు, ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠకూ సాక్ష్మిగా నిలిచారు.తండ్రి, తల్లి ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే కావడం గమనార్హం. "ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతోంది. మా కూతురు విజయంతో ఆ విషయాన్ని మళ్లీ నిరూపించింది" అంటూ వారు గర్వంగా చెప్పారు.హరిణి ఈ విజయాన్ని సాధించేందుకు అంకిత భావంతో చదువుకున్న విధానం, గురువుల మార్గదర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహం అన్నీ కలిసి ఆమెను ఈ స్థాయికి చేర్చాయి.ఇలాంటి ప్రతిభావంతుల కథలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆశిద్దాం!



## ఘనంగా మే డే వేడుకలు

అశ్వరావుపేట, మే 01 తొలి క్రాంతి:అశ్వరావుపేట సిపిఐ, ఏఐటియుసి మండల సమితి ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సయ్యద్ మియాజాని భవన్ వద్ద జెండా ఆవిష్కరణతో ప్రారంభమైన ర్యాలీ, పట్టణంలోని ప్రధాన ప్రాంతాలుగా సాగింది. లారీ, ఆటో, ట్రాలీ, మెకానిక్, చికెన్ మటన్ వర్కర్స్ యూనియన్ల వద్ద జెండాలను ఆవిష్కరించారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ ఐక్యంగా వేడుకలు నిర్వహించారు.సిపిఐ నేత సయ్యద్ సలీం మాట్లాడుతూ:మే డే చరిత్ర, కార్మికుల పోరాటాల ప్రాధాన్యతను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను అణిచివేస్తోందని విమర్శించారు. కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, మండల నాయకులు గన్నిన రామకృష్ణ, సయ్యద్ జైన్లావుద్దీన్, విజయకాంత్, పటాన్ జలాల్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. మహిళా, యువజన, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# "రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి"

## కలెక్టర్ జితేష్

ఖమ్మం, మే 01 తొలి క్రాంతి: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐడీఓసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులతో మే నెల కార్యాచరణ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఫామ్ పౌండ్‌లపై దృష్టి:బోరు ద్వారా సాగు చేసే రైతుల వ్యవసాయ భూముల్లో ఫామ్ పౌండ్స్ నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల భద్రతతో పాటు చేపల పెంపకం ద్వారా రైతుల ఆర్థిక స్థితిలో మెరుగుదల సాధించవచ్చన్నారు. ఆయా వివరాలను జల్ శక్తి అభియాన్ "చే జల్ – చేయ్ జీవన్" పథకంలో ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి – డ్రై డే పాటించడం తప్పనిసరి:ప్రతి నెల మొదటి మరియు మూడవ శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక యూనిట్లను ఇల్లందు, చుంచుపల్లి, అశ్వరావుపేట మరియు మణుగూరు ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని చెప్పారు.త్రాగునీటి సమస్యలపై ప్రత్యేక చర్యలు:మిషన్ భగీరథ అధికారులకు త్రాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు నిర్దేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ సరఫరా చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి:2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో ఫామ్ పౌండ్స్, రోడ్డు నిర్మాణాలు, ట్రెంచ్ వర్కులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వనమహోత్సవం లో భాగంగా మొక్కల నాటింపు:వనమహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా విస్తృతంగా మొక్కల నాటకం చేపట్టాలని చెప్పారు. చింత, రాగి, సుబబులు, వెలగ, సిస్సు, ఇంకా ఔషధ మొక్కలైన తులసి, ఇప్ప, కరక్కాయ మొక్కల నాటింపు పై దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలలలో "సీడ్ బ్యాంకులు" ఏర్పాటు చేసి విద్యార్థులలో విత్తనాల సేకరణపై అవగాహన కల్పించాలన్నారు.రేషన్ కార్డులు, ఎన్నికల దరఖాస్తులపై స్పష్టత:పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల దరఖాస్తులు (ఫామ్ 6, 7, 8) త్వరితగతిన పరిశీలించి పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా ఉండాలని, అర్హులందరికీ లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రాజీవ్ యువ వికాసం పై ప్రత్యేక దృష్టి:రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని, అర్హుల జాబితాను త్వరగా ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశానికి హాజరైన ముఖ్య అధికారులు:ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, మిషన్ భగీరథ ఇఇలు తిరుమలేశ్, నళిని తదితర అధికారులు పాల్గొన్నారు.





## కొత్తగూడెంలో మేడే ఉత్సవాలు

కొత్తగూడెం, మే 01 తొలి క్రాంతి:మజ్దూర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం నియోజకవర్గంలోని 283 కేంద్రాల్లో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో చికాగో అమరవీరులకు నివాళులర్పించడంతో పాటు మేడే జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడే అనేది ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ అని, శ్రామికుల హక్కుల రక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీలు బలపడాలని పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ప్రజలంతా పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విప్లవాత్మక మార్పుకు నాంది భూభారతి

## : పొంగులేటి శ్రీనివాస రెడ్డి


హైదరాబాదు, మే 01 తొలి క్రాంతి:తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టం ప్రజల్లో విశేష స్పందనను పొందుతోంది. ఏప్రిల్ 14న అమలులోకి వచ్చిన ఈ చట్టం నలుగురు పైలట్ మండలాల్లో విజయవంతంగా అమలవుతోంది. నేలకొండపల్లి, లింగంపేట, మద్దూర్, వెంకటాపూర్ మండలాల్లో 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయి. మొత్తం 11,630 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో పీపీబీ, సాదాబైనామాలకు సంబంధించినవి అధికంగా ఉన్నాయి.555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తయ్యాయి. ఏప్రిల్ 17 నుంచి 30 వరకు 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్వయంగా పాల్గొన్నారు. జూన్ 2 నాటికి పైలట్ మండలాల్లో భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టబోతున్నారు.ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలోని మిగతా 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలం చొప్పున భూభారతి చట్టాన్ని అమలు చేయనున్నారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగకుండానే రెవెన్యూ కార్యాలయాల వద్దే తమ సమస్యలు పరిష్కరించుకునేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది."చట్టం తీసుకురావడమే కాదు, అమలు చేయడంలోనే న్యాయం ఉంది," అని మంత్రి వ్యాఖ్యానించారు.



# మే డే స్ఫూర్తితో కార్మిక ఐక్యతకు పిలుపు

అశ్వారావుపేట, మే 01 తొలి క్రాంతి: సిఐటియు ఆధ్వర్యంలో 139వ మే డే వేడుకలు మున్సిపాలిటీ ఆఫీస్ హమాలీ అడ్డ వద్ద ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ, కార్మిక వర్గం త్యాగాలతో సాధించిన 8 గంటల పని దినాన్ని గుర్తు చేస్తూ, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్లను తీవ్రంగా వ్యతిరేకించారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు, సిఐటియు మండల నాయకులు పాల్గొన్నారు.



## వివాహ, రిసెప్షన్ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట, మే 01 తొలి క్రాంతి: అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దమ్మపేట మండలంలో నిర్వహించిన వివాహ, రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్నారు. మొద్దులగూడెం గ్రామంలో మోరంపూడి వెంకటేశ్వరరావు కుమారుడు మురళికృష్ణ రిసెప్షన్‌లో పాల్గొని కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. అలాగే దిబ్బగూడెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ నాయుడు శ్రీను – మంగ దంపతుల కుమారుడు రాజేష్ వివాహ కార్యక్రమంలో పాల్గొని నవదంపతులకు ఆశీర్వాదాలు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దొడ్డా రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాస్ రావు, మాజీ సర్పంచ్‌లు సున్నం రాము, రూప్ సింగ్, నాయకులు బాల రవి, ములగలపాటి ప్రసాద్, అంకత ఉమామహేశ్వరరావు, దారా యుగంధర్, జలగం వాసు, మహిళా నాయకురాలు యట్ల వెంకమ్మ, గంగరాజు, నల్లపు నాగేంద్ర, అబ్దుల్ జిన్నా, పుల్లారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో

# మేడే వేడుకలు ఘనంగా

అశ్వరావుపేట, మే 01 తొలి క్రాంతి: మజ్దూరుల హక్కులను గుర్తుచేస్తూ మరియు వారి సంక్షేమాన్ని మెరుగుపరచే లక్ష్యంతో, శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం నారాయణపురం ఆటో యూనియన్ ప్రాంగణంలో ఎంతో ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని టీఈసీఎస్(ట్రేడ్ యూనియన్) పార్టీ మండల సెక్రటరీ , అలాగే మండల పార్టీ నాయకులు ప్రభాకర్, లక్ష్మణరావు మరియు బుచ్చిరాజు సమక్షంలో ఘనంగా నిర్వహించారు.



కార్యక్రమం అనంతరం కార్మికుల హక్కులు, వారి జీవన ప్రమాణాలు మరియు ఆటో డ్రైవర్ల సమస్యలపై ముఖ్యులు మాట్లాడారు.కట్ట మైసమ్మ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీ కుమార్ స్వామి , ఇంచార్జ్ నిమ్మల మురళి , యతి రాజు నరేష్, పాయం సతీష్, జక్కుల సందీప్, చానపూడి అశోక్, జక్కుల వెంకటేశ్వరరావు, మడకం మంగరాజు, సున్న మంగరాజు, చిచ్చుడి శేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో ప్రముఖంగా పాల్గొన్నారు.ఈ మేడే వేడుకలు యూనియన్ సభ్యుల ఐక్యతను ప్రతిబింబించేలా, సంఘీభావం తో, ఆత్మీయతతో నిర్వహించబడ్డాయి. ఆటో డ్రైవర్ల సమస్యలు, ప్రభుత్వానికి సమర్పించాల్సిన డిమాండ్లు, రహదారి భద్రత తదితర అంశాలపై చర్చించి, తగిన చర్యలు తీసుకునే విధంగా తీర్మానాలు చేశారు.